ఫ్యాన్సీ నంబర్‌కు రూ.9,99,999

సొంతం చేసుకున్న ఎంఎస్‌ఎస్‌ఎస్ ఇన్‌ఫ్రాటెక్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 27 : కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయంలో ఓ ఫ్యాన్సీ నంబర్‌కు వేలం వేయగా.. ఎంఎస్‌ఎస్‌ఎస్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ భారీ ధర చెల్లించి దక్కించుకున్నట్టు ఎంవీఐ శ్రీనుబాబు తెలిపారు. టీజీ 08కే 9999 నంబర్‌కు బేసిక్ ధర రూ.50 వేలు నిర్ణయించగా.. సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎంఎస్‌ఎస్‌ఎస్ ఇన్‌ఫ్రాటెక్ రూ.9,99,999 బిడ్‌ను దాఖలు చేసి నంబర్‌ను కైవసం చేసుకున్నట్టు చెప్పారు. ఇది కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయ చరిత్రలోనే అత్యధిక ధర అని తెలిపారు.

సరస్వతి పుష్కరాలకు 25 కోట్లు

స్వరాష్ట్రంలో ఘనంగా పుష్కరాలు: మంత్రి కొండా

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ. 25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సరస్వతి నది పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో మౌలిక వసతుల కల్పనతో పాటు స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్‌లను ఆ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపట్టాలని, పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. తెలంగాణ ఏర్పాటుకు పూర్వం 2013లో సరస్వతి పుష్కరాలు జరిగాయి. స్వరాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఈసారి ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఘనంగా పుష్కరాలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

4 నెలలైనా తొలి జీతం ఇయ్యలె!

- ఇరిగేషన్ శాఖలో నూతన ఏఈఈలకు ఆదిలోనే చేదు అనుభవం
- ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా పోస్టింగ్ ఇచ్చారంటూ ఆర్థిక శాఖ కొర్రీ
- 122 మంది వేతనాలు నిలిపివేత
- గతంలోని నిబంధనల మేరకే పోస్టింగ్ ఇచ్చామంటున్న నీటిపారుదల శాఖ
- మంత్రి ఆదేశాలనూ బేఖాతర్



ఇటీవల ఏఈఈలుగా ఎంపికైన యువతీయువకులు

హైదరాబాద్, జనవరి27 (నమస్తే తెలంగాణ): ఉద్యోగంలో చేరి నాలుగు నెలలైనా ఇంకా తొలి జీతం అందని దాక్ష మాదిరిగానే వెక్కిరిస్తున్నది. ఇదీ ఇరిగేషన్‌శాఖలో నూతనంగా నియమితులైన ఏఈఈల ఆవేదన. అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా, స్వయంగా మంత్రి కలుగజేసుకున్నా ఇప్పటికీ వారికి వేతనం అందలేదు. నీటిపారుదల శాఖలో ఇటీవల కొత్తగా 677 మంది ఇంజినీర్లను నియమించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను అనుసరించి టీజీపీఎస్సీ ఏఈఈలను నియమించింది. తదనంతరం ఇరిగేషన్‌శాఖకు ఆ జాబితాను పంపింది. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను మరోసారి నిర్వహించారు. అనంతరం పోస్టింగ్ ఆర్డర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గత సెప్టెంబర్‌లో అందజేశారు. పోస్టింగ్ అందుకున్న 677 మందిలో 122 మంది ఏఈఈలకు సంబంధించిన వేతనాలను చెల్లించకుండా ఆర్థిక శాఖ నిలిపివేసింది. వీరికి 2018 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా పోస్టింగ్ ఇచ్చారంటూ మెలికపెట్టింది. స్థానికత ఆధారంగానే ఉద్యోగుల ఎంపిక, పోస్టింగ్ ఆర్డర్లు ఒకే విధంగా ఉండాలని, కానీ, అందుకు భిన్నంగా పోస్టింగ్ ఇచ్చారంటూ అభ్యంతరం తెలిపింది. మల్టీజోన్-1కు చెందిన దాదాపు 95 మంది ఏఈఈలకు మల్టీజోన్-2లో, మల్టీజోన్-2కు ఎంపికైన 27 మంది ఏఈఈలకు మల్టీజోన్-1లో పోస్టింగ్ ఇచ్చారని వివరించింది. మొత్తంగా 122 మంది ఏఈఈల పోస్టింగ్‌పై వివరణ ఇవ్వాలని ఇరిగేషన్ శాఖకు సూచించింది.

ఇరిగేషన్ శాఖ అసహనం

ఆర్థికశాఖ అభ్యంతరాలపై ఇరిగేషన్ శాఖ అసహనం వ్యక్తంచేస్తున్నది. ఇరిగేషన్‌శాఖలో ఆ తరహా పోస్టింగ్ ప్రక్రియ లేదని వాదిస్తున్నది. ప్రాజెక్టుల నిర్వహణ, పనుల అవసరాల రీత్యా ఇరిగేషన్‌శాఖలో పోస్టింగ్‌లు కొనసాగుతాయని, అయితే సదరు ఉద్యోగుల సర్వీస్ మొత్తంగా వారివారి జోన్‌లోనే ఉంటుందని వెల్లడించింది. గత 40 ఏండ్లుగా ఈ విధానం అమలులో ఉన్నదని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రాజెక్టుల నిర్వహణ, పనులు అవసరాల రీత్యానే తాజాగా పోస్టింగ్‌లను ఇచ్చామని చెప్తున్నారు. దీనిపై ఆర్థిక శాఖ కొర్రీలు పెట్టడంపై ఇరిగేషన్‌శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నది.

మంత్రి ఆదేశించినా బేఖాతర్

తొలి వేతనం కోసమే నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్న 122 మంది ఏఈఈలు ఇటీవల సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. మంత్రి కూడా అప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. వేతనాలను చెల్లించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికి పది రోజులు గడుస్తున్నా ఏఈఈలకు వేతనాలు చెల్లించకపోవడం గమనార్హం. దీంతో ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులను మరోసారి కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. దూరప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ ఖర్చులు భరించలేకపోతున్నామని, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని, సమస్యను పరిష్కరించి ఏఈఈలకు వేతనాలను అందేలా చొరవ చూపాలని హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపోలు రవీందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

టీసీఎస్ ఐయాన్‌ఇంటెలిజెమ్ విజేత సంస్కృతి కొండూరు

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో జాతీయ టైటిల్

యూనివర్సల్ వాల్యూస్ అంశంలో రెండో స్థానం

సంస్కృతి బహుముఖ ప్రజ్ఞాశాలి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మక టీసీఎస్ ఐయాన్‌ఇంటెలిజెమ్ నిర్వహించిన దేశవ్యాప్త టాలెంట్ టెస్ట్‌లో హైదరాబాద్ విద్యార్థిని విజేతగా నిలిచింది. 'కమ్యూనికేషన్ స్కిల్స్' 7వ ఎడిషన్ సీనియర్ క్యాటగిరీలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని సంస్కృతి కొండూరు టైటిల్ సాధించి చరిత్ర సృష్టించింది. అదే సంస్థ నిర్వహించిన 'యూనివర్సల్ వాల్యూస్, ఫైనాన్షియల్ లిటరసీ' సీనియర్ క్యాటగిరీ టాలెంట్ టెస్ట్‌లోనూ రన్నరప్‌గా నిలిచింది. టీసీఎస్ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టుల్లో సంస్కృతి వరుసగా మూడేండ్లు గ్రాండ్ ఫినాలేకు చేరుకుంది. దేశవ్యాప్తంగా ప్రముఖ పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ టెస్ట్‌లో పాల్గొని విజేతగా నిలవడానికి తోడ్పాటునందించిన తల్లిదండ్రులు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి సంస్కృతి కృతజ్ఞతలు తెలిపింది. సంస్కృతి గెలిచిన నేపథ్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కూడా 'స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు'ను అందుకుంది.

హెచ్‌సీఎల్ జిగ్సా-2022 జాతీయ స్థాయి ఫైనల్స్‌లో క్వాలిఫయింగ్ రౌండ్‌లో 97.31 పర్సంటైల్‌తో సంస్కృతి రన్నరప్‌గా నిలిచింది. 2023లో క్వాలిఫయింగ్ రౌండ్‌లో 99.85 పర్సంటైల్‌తో సెమీ ఫైనలిస్ట్‌గా నిలిచింది. ఐఐటీ బాంబే యురేకా జూనియర్స్ అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో ఫైనలిస్ట్‌గా నిలిచింది.

కట్టెల పొయ్యిపై వండొద్దు.. బోర్ నీళ్లు వాడొద్దు

- అన్ని విద్యాసంస్థలకు కామన్ మెనూ
- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం అమలు
- మెస్ చార్జీలు మరో 2 రూపాయల పెంపు
- సీఎస్‌కు విద్యాకమిషన్ నివేదిక

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల అస్వస్థత, మరణాలపై అధ్యయనం చేసిన తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పరిష్కార మార్గాలను సూచించింది. "మధ్యాహ్న భోజన పథకం మరియు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆహార నాణ్యత, భద్రతపై సిఫారసులు" శీర్షికతో 50 పేజీల నివేదికకు సీఎస్‌కు అందించింది.

విద్యాకమిషన్ నివేదికలో సిఫారసులు

- గ్యాస్ పొయ్యి మీదే వంట చేయాలి, భోజనం కట్టెల పొయ్యిపై వండొద్దు.
- వంటకు, తాగేందుకు బోర్ నీళ్లు వాడొద్దు, మిషన్ భగీరథ నీళ్లను ఉపయోగించాలి.
- అంగన్‌వాడీల నుంచి గురుకులాల వరకు అన్ని విద్యాసంస్థలకు కామన్ మెనూ అమలు చేయాలి.
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పెట్టాలి.
- సన్నబియ్యం, పరిశుభ్రమైన కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్ వంటి పోషకాహారం అందించాలి.
- తెలంగాణ విద్యాసంక్షేమం, మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా సరకులు సరఫరా చేయాలి.
- సెంట్రలైజ్డ్ టెండర్ల ద్వారా సరుకులు, సామగ్రి సమకూర్చుకోవాలి.
- అన్ని క్యాటగిరీల వారికి మెస్ చార్జీలను రూ.2 చొప్పున పెంచాలి.
- 1-5 తరగతులు, 6-8 తరగతులు, 9, 10 తరగతుల్లోని విద్యార్థులకు వేర్వేరు పరిమాణంలో భోజనం అందించాలి.
- గురుకులాల్లోని విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నట్టుగానే పాఠశాల విద్యార్థులకు కూడా స్నాక్స్ సమకూర్చాలి.
- మధ్యాహ్న భోజన పథకంలో వర్కర్లు, వంటవాళ్లు, సహాయకుల వేతనం, పారితోషికం పెంచాలి.
- విశాలమైన డైనింగ్ హాల్, ఫర్నీచర్‌ను అందుబాటులో ఉంచాలి.
- ఆహారం, నీటి నమూనాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్)తో తరుచూగా పరీక్షలు చేయించాలి.
- వంటగది, మరుగుదొడ్లు, భోజనశాలను ఎప్పటికిప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి.
- విద్యాసంస్థలన్నింటికీ ప్రహరీ గోడలు నిర్మించాలి, పాములు, విషపురుగులు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లారీల చోరీ కేసులో నిందితుల అరెస్టు

తిప్పర్తి, జనవరి 27: రోడ్డు వెంట నిలిపి ఉంచిన లారీలను చోరీ చేస్తున్న నిందితులను అరెస్టు చేసి, రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు నల్లగొండ డీఎస్పీ కొలను శివరామ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం తిప్పర్తి సెంటర్‌లో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్సై సాయిప్రశాంత్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నంబర్‌ప్లేట్ లేని రెండు కార్లలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. వీరిని నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాములకు చెందిన మెండె వెంకన్న, గుంజేటి శ్రీనివాస్, కొర్పుల సాయికుమార్, కొత్తగూడెం జిల్లాకు చెందిన అరిక రవిగా గుర్తించారు. వీరు కొంతకాలంగా రాత్రి సమయంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన వాహనాలను చోరీ చేసి విజయవాడలోని ఆటోనగర్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ శివరామ్‌రెడ్డి తెలిపారు.

టెన్షన్ నుంచి గట్టెక్కెందుకు 'హెల్ప్'

- సమీపిస్తున్న ఇంటర్ వార్షిక పరీక్షలు
- విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు ఇంటర్‌బోర్డు చర్యలు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : పరీక్షలంటేనే ఎక్కడా లేని భయం.. టెన్షన్.. ఒత్తిడి విద్యార్థులను ఆవహిస్తుంది. విద్యార్థుల్లో సహజంగా ఉండే ఈ టెన్షన్‌ను తొలిగించేందుకు.. వారికి భరోసా ఇచ్చేందుకు ఇంటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ లైఫ్ పొటెన్షియల్ (హెల్ప్) ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. సర్కారు జూనియర్ కాలేజీల్లోని విద్యార్థుల ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు సహకారంతో వలంటీర్లు రాష్ట్రవ్యాప్తంగా ట్రైనింగ్ సెషన్లు(శిక్షణా కార్యక్రమాలను) నిర్వహిస్తున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరుగనున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 307 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో హెల్ప్ శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనికి 50వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు టెలిమానస్ సేవలను ఇంటర్‌బోర్డు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు 14416 లేదా 1800 -914416 నెంబర్లను సంప్రదించవచ్చు.

2.45 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు మాయం!

ఈక్విటాస్ బ్యాంకు మేనేజర్‌పై సీసీఎస్‌లో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27(నమస్తే తెలంగాణ): రూ.2.45 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు మాయమైన ఘటనలో ఈక్విటాస్ బ్యాంకు మేనేజర్‌పై సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మలక్‌పేటకు చెందిన తిరుమల బ్యాంకు 2016 నుంచి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిమిటెడ్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తూ వస్తున్నది. తమను బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ రూ.2.45 కోట్లకు మోసం చేశారని గ్రహించిన తిరుమల బ్యాంకు సీఈఓ శోభనాద్రి సీసీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

రూపాయి ఇవ్వరు.. మీ పెత్తనమేంది?

- యూజీసీ తీరును వ్యతిరేకిస్తున్నాం
- వర్సిటీల అటానమీని దెబ్బతీస్తే ఊరుకోం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ యూనివర్సిటీలకు రూపాయి ఇవ్వకుండా రెగ్యులేషన్స్ పేరిట పెత్తనం చెలాయించడమేంటని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని ప్రశ్నించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాకల్టీ, వీసీల నియామకంపై యూజీసీ విడుదల చేసిన డ్రాఫ్ట్ మార్గదర్శకాలతో వర్సిటీల స్వతంత్రత (అటానమీ) దెబ్బతింటుందని తెలిపారు. యూజీసీ తీరును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మార్గదర్శకాలు ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నాయని, వీసీల నియామకాలు పూర్తిగా కేంద్రం చేతుల్లోకి వెళ్తాయని, బ్యూరోక్రాట్స్‌ను వీసీలుగా నియమించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. యూజీసీ తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, రాష్ట్ర వర్సిటీలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. ఈ మార్గదర్శకాలతో జరిగే నష్టంపై ఓ నివేదికను తయారుచేసేందుకు కమిటీ వేశామని, ఈ నివేదిక రాగానే రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. యూజీసీ మార్గదర్శకాలను కేరళ సహా పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని, త్వరలోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి యూజీసీకి లేఖరాస్తారని వెల్లడించారు. యూజీసీ తీరుపై, మార్గదర్శకాలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ లేఖలు రాయాలని వర్సిటీలను ఆయన కోరారు. ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, ఇటికాల పురుషోత్తం, మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల విరమణ వయస్సు పెంచొద్దు

టీవీజీఏ అధ్యక్షుడు కాటం శ్రీధర్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచాలనే ప్రభుత్వ ఆలోచనను తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(టీవీజీఏ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఖండించారు. ఈ నిర్ణయం వల్ల నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పీజీ, పీహెచ్‌డీలు చేసిన ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగుల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పదవీ విరమణ వయస్సు పెంచడం బాధాకరమని వాపోయారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు వెంటనే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగులంతా ఒక్కటై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల వయోపరిమితి పెంపు వద్దు

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల వయోపరిమితిని పెంచొద్దని, ప్రభుత్వం ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కే ధర్మేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగుల వయోపరిమితి పెంపుతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 58 ఏండ్లుగా ఉన్న రిటైర్మెంట్ వయసును 61 ఏండ్లకు పెంచారని, మళ్లీ దానిని పెంచాలనే ప్రతిపాదన సరికాదని తెలిపారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు తాత్సారం చేస్తున్నదని మండిపడ్డారు. ఉద్యోగ వయోపరిమితి వయసును పెంచాలనే కుట్ర చేస్తే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, మాజిద్, కల్యాణ్, పాల్గొన్నారు.

ఆబ్కారీ శాఖపై సర్కార్ శీతకన్ను!

- కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు పత్తా లేవు
- కొత్త ఉద్యోగులకు పోస్టింగులు లేవు
- 13 నెలులైనా పట్టించుకోని ప్రభుత్వం
- కేసీఆర్‌కు క్రెడిట్ దక్కుతుందనే తొక్కిపెట్టారా అని అనుమానాలు?
- గ్రూప్-4 అభ్యర్థులకూ తప్పని నిరీక్షణ
- 2 నెలలుగా ప్రభుత్వం వద్దే ఫైల్
- వెంటనే పోస్టింగులు ఇవ్వాలని అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, జనవరి27 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ శాఖ ద్వారా వేలాది కోట్ల ఆదాయం పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. అదే శాఖకు వనరుల కల్పనను మాత్రం అటకెక్కించింది. ఎక్సైజ్ శాఖ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుతూ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం13 నెలులుగా పట్టించుకోవడమే లేదు. గ్రూప్-4 ద్వారాఎక్సైజ్ శాఖను కేటాయించి 72 మంది అభ్యర్థులకు ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. ఏడాదికి రూ.200 కోట్లకు పైగా ఆదాయం తెచ్చిపెడుతున్న ఎక్సైజ్ స్టేషన్లలో నిర్వహణ ఇబ్బందిగా ఉన్నట్టు క్షేత్రస్థాయి ఫిర్యాదుల నేపథ్యంలో ఒక్కొక్క స్టేషన్‌ను రెండుగా విభజించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 13 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక స్టేషన్ చొప్పున కొత్తగా ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఆనాడే నివేదికలు రూపొందించింది. ఆ మేరకు 2022 ఆగస్టులోనే అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. దీంతో 13 కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటు కోసం ఎక్సైజ్ కమిషనర్ నివేదికలు పంపగా, ఆర్థిక శాఖ నుంచి కూడా అనుమతులు వచ్చాయి. ఈ లోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అనంతర ప్రక్రియ నిలిచింది. ఈ లోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఆ ఫైల్ అటకెక్కింది. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ నగర పరిధిలోని శేరిలింగంపల్లి, బాలానగర్, మల్కాజిగిరి, ఘట్‌కేసర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, శంషాబాద్, పటాన్‌చెరు, సికింద్రాబాద్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, నాంపల్లి, హనుమకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో స్టేషన్‌ను అదనంగా ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి.

క్రెడిట్ కేసీఆర్‌కు దక్కుతుందని..

కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు అనుమతించి ఉంటే ప్రతి స్టేషన్‌ను ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు, ఒక డ్రైవర్ చొప్పున మొత్తం 21 కొత్త ఉద్యోగాల సృష్టి జరిగేది. మొత్తం 14 స్టేషన్లలో కలిపి కనీసం 294 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. సర్వీస్‌లో ఉన్నవారికి పదోన్నతులు లభిస్తాయి. మూడేండ్ల పాటు ఒకే చోట పనిచేస్తున్న అధికారులకు బదిలీలు జరుగుతాయి. ఒక్క సంతకంతో పూర్తయ్యే పనిని కాంగ్రెస్ ప్రభుత్వం 13 నెలులుగా తొక్కి పెడుతున్నది. కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తే.. ఆ క్రెడిట్ కేసీఆర్‌కు దక్కుతుందనే ఏకైక కారణంతోనే ఆ ఫైల్‌ను పక్కన పెట్టారని ఎక్సైజ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేసి పనిభారాన్ని తగ్గించడంతోపాటు, పదోన్నతులు, బదిలీలకు మార్గం సుగమం చేయాలని వారంతా కోరుతున్నారు.

గ్రూప్-4 అభ్యర్థుల ఎదురుచూపులు

గ్రూప్-4 ద్వారా ఎంపికైన 72 మంది అభ్యర్థులను ఎక్సైజ్ శాఖకు కేటాయించారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలను కూడా ఇచ్చారు. ఇది జరిగి రెండు నెలలవుతున్నా పోస్టింగులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థులంతా బుధవారం ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు వెంటను పోసింగులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఖాళీల సర్దుబాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వ అనుమతి రాగానే అందరికీ పోసింగులు ఇస్తామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

కిడ్నీ రాకెట్‌లో మరో డాక్టర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో బయటపడ్డ కిడ్నీ అక్రమ మార్పిడుల కేసు దర్యాప్తును రాచకొండ పోలీసులు ముమ్మరం చేశారు. కేసులో ఇప్పటికే 10 మంది నిందితులను అరెస్టు చేయగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన డాక్టర్ రాజశేఖర్‌ను అరెస్టు చేశామని సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి తెలిపారు. విశాఖపట్నంకు చెందిన రాజశేఖర్ తమిళనాడు, బెంగళూర్‌లో ఉంటూ కిడ్నీ మాఫియా దళారులతో సం